క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను శనివారం మండల పశు వైద్యాధికారి శిరీష పంపిణీ చేశారు. 45 ఎద్దులు, ఆవులకు, 122 గేదెలకు గాలికుంట వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. అనంతరం పాడి రైతులకు అవగాహన కల్పించారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించం

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో నెలకొల్పే ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్కడ నెలకొల్పే ఫ్యాక్టరీతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినకుండా నిబంధనలు పాటించాలన్నారు. ప్రజలకు కలుషితం లేని వాతావరణం అందేలా జాగ్రత్తలు పాటించాలని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండో దఫా యూనిఫాంను పాఠశాల ఇన్‌చార్జ్ జీహెచ్‌ఎం గౌరీశంకర్ విద్యార్థులకు అందజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ రెండో జత యూనిఫాం ప్రభుత్వం సరఫరా చేసిందని, వాటిని శనివారం విద్యార్థులకు అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్‌గా జగదీశ్వరా చారి వ్యవహరించారని వారు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని వారు ఆకాంక్షించారు.

గద్వాలలో బైక్‌ల చోరీ కలకలం

గద్వాల క్రైం: పట్టణంలోని లింగంబాగ్, సెంకడ్ రైల్వే గేట్, నల్లకుంట కాలనీలో ఇళ్ల ఎదుట నిలిపిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. నరేష్‌కు చెందిన హెచ్‌ఎఫ్ డీలక్స్, వరప్రసాద్‌కు చెందిన హోండా, రాములుకు చెందిన యాక్టివా, స్వప్నకు చెందిన స్కూటీని రోజు వారిలాగే శుక్రవారం కూడా ఇంటి ముందు పార్క్ చేశారు. అయితే గుర్తు తెలియని దుండగులు ఇంటి వద్ద నిలిపిన రెండు స్కూటీలు, రెండు బైక్‌లను అపహరించారు. ఈ ఘటనపై బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ కళ్యాణకుమార్ తెలిపారు.

భూ వివాదం: కేసు నమోదు

కేటీదొడ్డి: పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటనలో శనివారం మండలంలోని చింతలకుంటలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చింతలకుంటకు చెందిన కుర్వ నాజేంద్ర అదే గ్రామానికి చెందిన కుర్వ విజయ్‌కు మధ్య కొన్నేళ్లుగా పొలం పంచాయతీ నడుస్తుంది. కుర్వ నాజేంద్రకి చెందిన 2 ఎకరాల భూమిలో కుర్వ విజయ్, కుర్వ మౌలన్న, శారదమ్మ, వీరన్న ట్రాక్టర్‌తో దున్నుతుండగా నాజేంద్ర కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో వారు నాజేంద్ర కుటుంబ సభ్యులపై కట్టెలతో దాడి చేశారు. ఈదాడిలో నాజేంద్ర, అతడి భార్య మహేశ్వరి, ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై విచారణ

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై శనివారం ఎంఆర్‌ఐ గురురాజ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై కలెక్టర్ ఆదేశానుసారం గ్రామాల్లో విచారణ చేస్తున్నామని తెలిపారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ

గద్వాలటౌన్: పంజాబ్‌లోని అమృతసర్‌లో వచ్చే నెల 12 నుంచి 14 వరకు జరిగే ఆల్ ఇండియా తైక్వాండో యూనివర్సిటీ పోటీలకు గద్వాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో రెండు రోజులు పాటు జరిగిన ఎంపిక పోటీలలో గద్వాలకు చెందిన లోకేశ్వరి 46 కేజీల విభాగంలో ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించారు. పాలమూరు యూన్నివర్సిటీలో జరిగిన ఎంపిక పోటీలలో గద్వాలకు చెందిన తరుణ్ 52 కేజీల విభాగంలో సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించారు. వీరిద్దరు కొన్నేళ్లుగా కరాటే మాస్టర్ శ్రీహరితో శిక్షణ తీసుకున్నారు

విద్యార్థులకు నాణ్యమైన బోధన



మాచర్లలో మాట్లాడుతున్న ఎంఈఓ నల్లారెడ్డి


పెద్ద ధన్వాడలో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

రాజోళి: పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద ధన్వాడ యూపీఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాప్ ఔట్ విద్యార్థులు, సిబ్బంది కొరత, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, విద్య, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. గతంలో ఈ విషయం కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, దీంతో వలంటీర్‌ను కేటాయించారని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భగీరథరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు స్వప్నరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

గట్టు: తల్లిదండ్రులు వారి పిల్లలను క్రమం తప్పక పాఠశాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నల్లారెడ్డి కోరారు. శనివారం మాచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పక పాఠశాలకు వస్తే, చదువుపై శ్రద్ధ పెరుగుతుందని, తద్వారా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెరుగుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన సాగించాలని కోరారు. బడి మానేసిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించి, అవసరమైతే వారి తల్లిదండ్రులతో మాట్లాడి రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులకు నచ్చచెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు,అంగన్‌వాడి, టీచర్లు పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్ జారీలో అలసత్వం

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2 గ్రామానికి చెందిన చిన్న భీసన్న 19 ఏళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి కాశమ్మ, కుమారుడు ఆనంద్ ఇద్దరు కలిసి తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం కొన్ని నెలలుగా తిరుగుతున్నారు. చివరి దశకు చేరుకున్న సమయంలో గెజిటెడ్ అధికారులు మేము సంతకం చేయమంటే.. మేము చేయమని వెనక్కి పంపుతున్నారు. గెజిటెడ్ సంతకం కోసం తిరగని చోటు లేదు, అడగని అధికారులు లేరని వాపోయారు. ఏ పాఠశాలకు వెళ్లినా, మండల అధికారి వద్దకు వెళ్లిన ఇక్కడి నుంచి వెళ్లు అని పంపుతున్నారని వారి గోడు విన్నవించారు. చివరికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినా.. సంతకం పక్కాగా కావాలి అని చెప్పడంతో కథ మళ్లీ మొదటికి వచ్చిందని బాధితులు వాపోతున్నారు. పలు పత్రాలు పరిశీలించి గెజిటెడ్ సంతకాలని పెట్టకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే విద్యార్థుల ఉద్యోగాలు, చదవులు, వృద్ధులకు అవసరమైన పలు రకాల పనులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆలోచించాలి. లేదంటే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ 1 పరీక్షలు ప్రారంభం

ధరూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి సమ్మెటివ్ అస్సెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా రూంలను కేటాయించి వాటిలో రోల్ నంబర్లు వేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజు 9.30 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని, 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ

ధరూరు: ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ధరూరులోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పార్థసారథి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రంగన్న, రాములు, జాంపల్లి నర్సింహులు, సత్యన్న, కిష్టన్న, చిరు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిని సారించాలి


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

గట్టు: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని భవిష్య భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఫౌండేషన్ జీవనోపాధుల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం తప్పెట్లమొర్సు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో క్రిమిసంహార మందులు, రసాయనిక ఎరువులను వాడడం ద్వారా భూసారంపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గి, రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. సంప్రదాయ పద్ధతిలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. వరి, మిరప, వేరుశనగ పంటలను పండించే విధానం, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మనకు అందుబాటులో ఉండే గోమూత్రం, పేడతో పాటుగా ప్రకృతిలో దొరికే చెట్లు, ఆకులతో మందులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. వేప నూనెలను ఉపయోగించాలని కోరారు. 75 శాతం రాయితీతో వేప నూనును 35 మంది రైతులకు అందజేశారు. కార్యక్రమంలో భవిష్య భారత్ సిబ్బంది హరికృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ పరమేష్‌చారి, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేద్దాం

అలంపూర్: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాజు, రేపల్లె దేవదాసు, జీకే ఈదన్న పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 25న సీపీఎం జిల్లా మూడో మహాసభలు జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్‌లో జరగనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు సాగర్, ఎం వీ రమణ హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభలను విజయవతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, నరసింహ, నాగరాజు, అయ్యప్ప భూపాల్, చెంచన్న తదితరులు ఉన్నారు.

రోడ్డంతా బురదమయం


వర్షపు నీటిలో నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

అలంపూర్ రూరల్: మండలంలోని లింగనేవాయి గ్రామంలో కొత్త ప్లాట్ల చివర వీధిలో రోడ్డు సరిగా లేక ఇబ్బందులు ఎదరవుతున్నాయని అధికారులకు తెలిపినా పట్టడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వరినాట్లు వేస్తు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోడ్డు సరిగా లేక కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ప్రతి నిత్యం తిరగడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మోకాళ్ల లోతు గుంతలు పడడంతో వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు అనేకసార్లు కిందపడ్డ ఘటనలు ఉన్నాయని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు జీకే ఈదన్న, కాలనీవాసులు లోకేష్, స్వాములు, రజియాబీ, నజీర్‌అహ్మద్, రహీం, రామంజనేయులు పాల్గొన్నారు.

పోషకాహార పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

మానవపాడు: మండలకేంద్రంలో ఇటిక్యాల, మానవపాడు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ టైం టేబుల్ పాటించాలని సూచించారు. సెంటర్లలో మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఆదేశించారు. ప్రతి నెల యాప్‌లలో ఎప్పటికప్పుడు డేటా నమోదు చేయాలన్నారు. పిల్లలకు బాలమృతం పంపిణీపై అవగాహన కల్పించామన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

మానవపాడు: మానవ అక్రమ రవాణా నిర్మూలన మనందరి బాధ్యత అని రాజ్‌కుమార్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం నిశ్శబ్ద నడక ర్యాలీ నిర్వహించారు. మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బానిసత్వాన్ని అంతం చేసినప్పుడే ప్రజలందరూ సేచ్ఛగా జీవిస్తారని తెలిపారు. మానవ అక్రమ రవాణాను నిరోధించాలని, ఆడపిల్లలపై అత్యాచారాలు అరికట్టాలని కోరుతూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందం, రాంప్రసాద్‌రెడ్డి, బుచ్చన్న, విజయ్‌కుమార్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలి



గద్వాలటౌన్: రాష్ట్రంలో ఆలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్‌రావు డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నేతలు నిరసన చేపట్టారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆలయాలను పరిరక్షించాలని అంటూ నినాదాలు చేశారు. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని త్రీవంగా ఖండించారు. రాష్ట్రంలో వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కనీసం స్పందించకపోవడం హిందూ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించడమేనని విమర్శించారు. అనంతరం నిందితులను కఠినంగా శిక్షించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విజయ్‌కుమార్, శ్రీకాంత్, ప్రబంద్‌కుమార్ రెడ్డి, వెంకటేష్, తిరుమలేష్, ఓంకార్, నాగరాజు ఉన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

ఎర్రవల్లి: మండలంలోని పుటాన్‌దొడ్డిలో మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌ఓ సారథ్యంలో సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు హాజరై గ్రామ ప్రజలకు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, చదువు వల్ల కలిగే ఉపయోగాలు, మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు తదితర అంశాలపై పాట, మాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు కేశవులు, కృష్ణ, కవిత, భూపతి నాయుడు తదితరులు ఉన్నారు.

గద్వాల సీఐగా టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం: గద్వాల సీఐగా టంగుటూరి శ్రీను శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్వాల సర్కిల్ పరిధిలో నమోదైన కేసులపై ప్రత్యేక చొరువ తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకాలపాలపై నిఘా ఉంచి కట్టడి చేస్తామన్నారు. అత్యవసర సమయాల్లో 100కు డయల్ చేయాలన్నారు. మైనర్ బాలికలు, మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన మారిన కఠినంగా శిక్షిస్తామన్నారు. నిషేధిత మత్తు పదార్థాల సరఫరా, క్రయవిక్రయాలు చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అభ్యర్థులపై లాఠీచార్జి చేయడం దుర్మార్గం


మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

గద్వాల అర్బన్: గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి నిరుద్యోగులు రూ.వేలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకున్నారని, మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని, జీఓ నంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం సరికాదన్నారు. వెంటనే గ్రూప్-1పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని, అరెస్టు చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు విడుదల చేయడంతో పాటు గతంలో కేసీఆర్ సర్కార్ తీసుకొచ్చిన జీవో నెం.55ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు బీఆర్‌ఎస్వీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మాధవ్, మాజ్, బషీర్, సల్మాన్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి అండగా కేటీఆర్


ఎంబీబీఎస్ విద్యార్థి సుస్మితను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని సుస్మిత చదువుకు భరోసా కల్పిస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ట్వీట్ చేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కుమార్తె సుస్మిత 2024 నీట్‌లో ప్రతిభ కనబరిచి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కోర్సు పూర్తి చేసేందుకు తల్లిదండ్రుల ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎంబీబీఎస్ సీటును వదులుకునేందుకు సిద్ధమవుతుండగా కొన్ని రోజుల క్రితం అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు, వెంకటాపురం గ్రామంలోని మరికొందరు వ్యక్తులు రూ. 50 వేలు ఆర్థికసాయం చేశారు. దానితో విద్యార్థిని సుస్మిత ఫీజు చెల్లించారు. విద్యార్థిని వివరాలను కొందరు వ్యక్తులు కేటీఆర్‌కు ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేయడంతో ఎంబీబీఎస్ విద్యార్థినికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇది ఇలా ఉండగా మండలంలోని వెంకటాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వాతిని శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' అమలు చేసే వరకు పోరాటం


ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన రైతు భరోసా పథకం హామీని అమలు చేసే వరకు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బాసు శ్యామల అన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో రైతు భరోసా పోయినట్లేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు రైతు భరోసా ఎగ్గొట్టి లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టిందని ధ్వజమెత్తారు. స్వయంగా వ్యవసాయశాఖ మంత్రే చేతులు ఎత్తేస్తున్నట్లు ప్రకటించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మోనెష్, శ్రీరాములు, పరశురాముడు, రాజునాయుడు, భాస్కర్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడికి సన్మానం


నిషాక్‌ను సన్మానిస్తున్న కార్మికులు

రాజోళి: ఓపెన్ హార్ట్ సర్జరీకి సహకరించి చేనేత కార్మికుడి ప్రాణాలు కాపాడిన జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ ను తోటి చేనేత కార్మికులు శనివారం సన్మానించారు. వివరాల్లోకి వెళితే.. రాజోళికి చెందిన చేనేత కార్మికుడు దౌలత్ అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్ ఆస్పత్రికి వెళ్లడంతో పరీక్షించిన వైద్యులు గుండె సర్జరీ చేయాలని సూచించారు. కానీ ఆయన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటం, హెల్త్ కార్డు కూడా లేకపోవడంతో విషయం తెలుసుకున్న నిషాక్.. తహసీల్దార్, అధికారులతో మాట్లాడి, ఆస్పత్రిలో వైద్యానికి అనుమతించే పత్రాలను రాయించి ఇవ్వడంతో పాటు, సర్జరీ సమయంలో అవసరమైన రక్తం కోసం నలుగురు వ్యక్తులను హైదరాబాద్ కేర్ ఆస్పత్రికి పంపడంతో సర్జరీ పూర్తయ్యింది. రూ.15 లక్షలు ఖర్చయ్యే సర్జరీని ఉచితంగా చేయడంలో సహకారం అందించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయనకు పూలమాల, శాలువాతో సన్మానించారు. రక్తదానంలో సహకరించిన చిరంజీవి అభిమాని శివరామయ్యను కూడా అభినందించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు మాయం


ఉండవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో బాధితుల ఎదురుచూపులు

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు గ్రామానికి చెందిన ఇద్దరి కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వడం లేదని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు అడగగా తమకు సంబంధం లేదని అధికారులు పేర్కొనట్లు తెలిపారు. ప్రాగటూరు గ్రామానికి చెందిన శారద కుమార్తె, మద్దిలేటి కుమార్తెకు చెందిన కల్యాణలక్ష్మికి సంబంధించిన పత్రాలు కనబడడం లేదని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సిబ్బందిని అడిగారు. దీంతో తమకు తెలియదని, బదిలీపై వెళ్లిన ఆర్‌ఐను అడగాలని అక్కడున్న అధికారులు సమాధానం చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌ఐ బాధ్యత తీసుకోకుండా మొత్తం జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లకు సమస్యను పరిష్కరించాలని తెలపడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తర్వాత పత్రాలు సమర్పించిన వారికి చెక్కులు వచ్చినా తమకు రావడం లేదని వాపోయారు. దీంతో కార్యాలయంలో చెక్కులు వెతుకుతామని సోమవారం, మంగళవారం రావాలని నచ్చచెప్పి పంపించారు. ఇదిలా ఉండగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 45 రోజులైనా ఇంతవరకు ఇవ్వడం లేదని బాధితులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై స్పందిచాలని బాధితులు వేడుకుంటున్నారు.